

భక్తితోనే ముక్తి

మానవుడికి భక్తి మార్గంలోనే ముక్తి లభిస్తుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పీఠాధిపతులు సూచించారు.

- 8లో ▸



యాప్‌లలో పెట్టుబడులు వద్దు

ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని సైబర్ క్రైం ఏసీపీ వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.7 /22.5

ఉదయం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలితీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు తుది ఓటరు జాబితా విడుదల

సుభాష్‌నగర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం గురువారం తుది ఓటరు జాబితా విడుదల చేయనుంది. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం 14,04,909 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 6,65,887 మంది పురుషులు, 7,38,963 మంది మహిళలు, 59 మంది ఇతరులున్నారు. గత నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. 22 వరకూ ఓటరు నమోదు, మార్పులు, చేర్పులనకు ఎన్నికల సంఘం అవకాశమిచ్చింది. ఆ తర్వాత దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాలు స్వీకరించారు. గురువారం తుది ఓటరు జాబితా విడుదలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

13న పెన్షన్ అదాలత్

నిజామాబాద్ సిటీ: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ కమిషనర్ గణేశ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.40 గంటల వరకు ఫిర్యాదులపై వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు వెబెక్స్ వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబరు 2641 169 8328, పాస్‌వర్డ్ ఈఎస్‌ఎఫ్1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని కమిషనర్ కోరారు.

జింక పిల్ల అప్పగింత



నందిపేట్: తల్వేద శివారులో లభ్యమైన జింకపిల్లను గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు బుధవారం అందజేశారు. గ్రామ శివారులోని పంటపొలాల్లో జింకపిల్లను కుక్కలు తరుముతుండగా చూసిన గ్రామస్తులు కుక్కల బారి నుంచి కాపాడి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ గ్రామస్తుల నుంచి జింకపిల్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రథమ చికిత్స చేయించి మాక్లూర్ మండలం చిన్నాపూర్ అర్బన్ పార్కులో వదిలినట్లు పేర్కొన్నారు.

లక్కీడ్రా పేరిట రూ.15 లక్షల మోసం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ఆటో డ్రైవర్‌ను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. లక్కీడ్రాలో రూ. 25 లక్షలు వచ్చాయంటూ నమ్మబలికి పలు చార్జీల పేరిట బాధితుడి నుంచి రూ. 15లక్షలు వసూలు చేసినట్లు నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన సాయిలుకు ఈనెల 4న సైబర్‌నేరగాళ్లు ఫోన్‌చేసి కేబీసీ కంపెనీకి చెందినవారమని నమ్మించి లక్కీడ్రాలో రూ. 25 లక్షలు వచ్చాయంటూ నమ్మబలికారు. ఈ నగదు రావాలంటే ముందుగా రూ. 5వేలు చెల్లించాలని తెలిపారు. దీంతో సాయిలు ఫోన్‌పే ద్వారా సంబంధిత లింకులకు డబ్బులు పంపించాడు. పలు చార్జీల పేరిట సాయిలు నుంచి సైబర్ నేరగాళ్లు రూ.15.74 లక్షలు వసూలు చేశారు. తీరా రూ. 25 లక్షల నగదు ఇవ్వాలంటూ సాయిలు వారిని కోరగా ప్రాసెసింగ్ నడుస్తోందంటూ నమ్మిస్తున్నారు. మోసపోయినట్లు గుర్తించిన సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై అప్రమత్తంగా ఉండాలి

- సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లు, వారు నిర్వహించే సంస్థలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గల్ఫ్‌కు పంపి ఉపాధి కల్పిస్తామని చెప్పి వీసాలు, పాస్‌పోర్టు ట్రావెల్, టూరిజం సర్వీసుల పేరుతో ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా ప్రభుత్వ అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నకిలీ జాబ్ లెటర్లు చూయించి ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గల్ఫ్ పేరిట అనధికారికంగా ట్రావెల్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరిపై అనేక క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లకు ఇల్లు, దుకాణాల సముదాయాలకు కిరాయికి ఇచ్చేముందు వారి పూర్తి వివరాలను సంబంధిత పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఎవరైనా నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ఉన్నట్లు సమాచారం తెలిస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పునరుద్ధరణ వేగవంతం

బోధన్‌లోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పున:ప్రారంభానికి కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన కమిటీ తన కార్యచరణను వేగవంతం చేసింది. ఫ్యాక్టరీకి గల రూ.4 వందల కోట్ల అప్పును బ్యాంకర్లతో రూ.190 కోట్ల చెల్లింపునకు ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. త్వరలో ఎన్‌ఎస్‌ఎఫ్ యూనిట్ల పరిధిలోని రైతులకు వ్యవసాయ, ఉద్యాన అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు.

- నిజాం షుగర్స్‌ను తెరిపించేందుకు ప్రభుత్వ కసరత్తు
- రుణాలిచ్చిన బ్యాంకర్లతో వన్‌టైం సెటిల్‌మెంట్‌కు నిర్ణయం
- జూన్‌లోగా రూ. 190 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. రూ. 20 కోట్ల చెల్లింపు
- 15 రోజుల్లో రైతులు, అధికారులతో ప్రభుత్వ కమిటీ సమావేశాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉత్తర తెలంగాణలో కీలకమైన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన కమిటీ వడివడిగా అడుగులు వేస్తోంది. కమిటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఆర్థిక, పరిశ్రమలు, వాణిజ్య, వ్యవసాయ, సహకార శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, కార్యదర్శులు ఉన్నారు. ఈ కమిటీ గత వారం రోజుల్లో భారీ కసరత్తు చేసింది. 2015 డిసెంబర్ 23న నిజాం షుగర్స్ లేఆఫ్ ప్రకటించారు. అయితే గతంలో తీసుకున్న రూ.400 కోట్ల అప్పులకు సంబంధించి 15 ఏళ్లుగా బకాయిలు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో బ్యాంకర్లకు వచ్చే జూన్ లోగా రూ.190 కోట్లు చెల్లించి వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకునేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో తాజాగా రూ.20 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.170 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో నిజాం షుగర్స్ అంశం ప్రధాన ప్రచారాస్త్రమైంది. ప్రచారంలో భాగంగా రైతులకు హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి నిజాంషుగర్స్‌ను తెరిపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కమిటీ వేసి ముందుకు నడిపిస్తున్నారు.

కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు..



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్, ముత్యంపేట, ముంబోజిపల్లిలలో ఉన్న నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించాలని రైతులు డిమాండ్లు చేస్తే గత కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, నిజాం షుగర్స్ కమిటీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. నిజాం పాలనలో 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు గాను నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారన్నారు. ఇంజినీర్ల సూచన మేరకు నిజాం రాజు చెరుకు సాగును ప్రోత్సహించేందుకు నిజాం షుగర్స్‌ను నెలకొల్పారన్నారు. ఈ ఫ్యాక్టరీ కోసం బోధన్ వద్ద 16,975 ఎకరాలు కేటాయించారన్నారు. వేలాదిమంది వ్యవసాయ కార్మికులకు, ఫ్యాక్టరీ కార్మికులకు ఉపాధి లభించింది. వీళ్ల పిల్లల కోసం మధుమలంచ కళాశాల, ఆస్పత్రి నిర్మించారు. ఎన్‌ఎస్‌ఎఫ్ ఆసియాలోనే చక్కెర ఉత్పత్తిలో పేరుగాంచింది. ఇంత పేరున్న ఫ్యాక్టరీని చంద్రబాబు హయాంలో 51 శాతం ప్రైవేటు, 49 శాతం ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచేలా చేశారని సుదర్శన్ పేర్కొన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఎన్‌ఎస్‌ఎఫ్‌ను పూర్తిగా ప్రభుత్వం నడుపుతుందని చెప్పిన కేసీఆర్ అధికారం దక్కాక పట్టించుకోలేదన్నారు. దీంతో 2015లో ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ఉన్న సమయంలో రూ.92 కోట్ల వ్యయంతో 20 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మించారన్నారు.

అతి ప్రాధాన్యత గల ఎన్‌ఎస్‌ఎఫ్‌ను తిరిగి తెరిపించేందుకు గత ఏడాది పాదయాత్ర సమయంలో మెట్‌పల్లి వద్ద రైతులకు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, అందులో భాగంగా ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కమిటీ వేశారని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులను చెరుకు సాగు చేసే దిశగా తీసుకెళుతున్నామన్నారు. దీంతో పాటు రుద్రూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కొత్త చెరుకు వంగడాలు తయారు చేయించి ఎకరానికి 50 నుంచి 60 టన్నుల దిగుబడి వచ్చేలా చేయనున్నట్లు పేర్కొన్నారు. బెల్లం ఎగుమతులను దృష్టిలో పెట్టుకుని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన ఆలోచనలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చెరుకు పాలసీ తీసుకొచ్చి గిట్టుబాటు ధర ఇస్తే చక్కెర పరిశ్రమలు నిలదొక్కుకుంటాయన్నారు. అయితే వచ్చే 15 రోజుల లోపు బోధన్, మెట్‌పల్లి, ముంబోజిపల్లి ప్రాంతాల్లో కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో కలిసి రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

అప్పుడే అడ్మిషన్ల దందా!

- పరీక్షలు ప్రారంభం కాకముందే షురూ
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు
- జిల్లాలో తిష్టవేసిన పీఆర్వోలు



నిజామాబాద్‌అర్బన్: కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అప్పుడే అడ్మిషన్ల దందాకు తెరలేపాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి నుంచే ప్రక్రియను ప్రారంభించాయి. కనీసం పరీక్షలు కూడా కాకముందే పైతరగతులకు సంబంధించిన అడ్మిషన్లను కొనసాగిస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రంలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ తతంగం కొనసాగిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కొద్ది రోజుల తర్వాత ఎక్కడ అడ్మిషన్లు దొరకవేమోననే అయోమయంలో తొందరపడుతున్నారు.

రెండు నెలల నుంచి..

ప్రైవేటు విద్యాసంస్థల పీఆర్వోలు జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో రెండు నెలల క్రితమే తిష్ట వేశారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల పాఠశాలలకు వెళ్తూ పాఠశాల యాజమాన్యాలను సంప్రదించి విద్యార్థుల ఫోన్‌నంబర్లను సేకరిస్తున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ అడ్మిషన్లు తీసుకోవాలని చెబుతున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలుస్తూ వారికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. తమ కళాశాలకు అడ్మిషన్లు ఇప్పివ్వాలంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. చదువులో మెరుగ్గా ఉన్న విద్యార్థుల వివరాలను ముందే తీసుకొని విద్యార్థుల తల్లిదండ్రులను కూడా కలుస్తున్నారు. కొందరు హెచ్‌ఎంలు ప్రైవేటు విద్యా సంస్థలకు సహకరిస్తున్నారు. ఇటీవల రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేట్ విద్యాసంస్థ జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌లో రెండుసార్లు భారీగా విందులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

నిబంధనలకు వ్యతిరేకంగా..

అడ్మిషన్ల ప్రక్రియను ముందే చేపట్టడం నిబంధనకు విరుద్ధమని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ఫలితాలు వెలువడిన తర్వాత మే, జూన్ సమయంలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ డిసెంబర్, జనవరి నుంచే ప్రక్రియను ప్రారంభించారు. నిబంధనలను గాలికి వదిలి అడ్మిషన్లు తీసుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిత్యం ఫోన్‌కాల్స్

హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ కళాశాలల సిబ్బంది పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి ప్రతిరోజూ ఫోన్‌కాల్స్ చేస్తున్నారు. తమ కళాశాలలో మెరుగ్గా సౌకర్యాలు ఉన్నాయని, ఫలితాలు బాగున్నాయని అడ్మిషన్లు తీసుకోవాలని చెబుతున్నారు. ముందే అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని, వివిధ విభాగాల్లో మంచి సీటు లభిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు సైతం విద్యార్థుల తల్లిదండ్రులకు అడ్మిషన్ల కోసం గాలం వేస్తున్నాయి. అనుమతి లేకుండా ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. మొబైల్ ఫోన్ల ద్వారా కళాశాల ప్రచార కరపత్రాలు పంపుతూ అడ్మిషన్లను కొనసాగిస్తున్నాయి.

అడ్మిషన్లు చేపట్టరాదు

ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టరాదు. ప్రైవేటు కళాశాలల్లో ముందస్తుగా అడ్మిషన్లు చేపడితే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని కళాశాలపై తప్పకుండా చర్యలు ఉంటాయి.

– రఘురాజ్, డీఐఈవో

పంట భూమిలో భగీరథ పైప్‌లైన్



పైప్‌లైన్ కోసం మట్టిని తవ్వుతున్న జేసీబీ

- తొలగించాలని కోరిన రైతు
- డబ్బులు లేవని చేతులెత్తేసిన అధికారులు
- సొంత ఖర్చులతో మరోచోటుకి పైప్‌లైన్ మారుస్తున్న రైతు
- ఐదురోజులుగా నీటిసరఫరా బంద్

ఎడపల్లి: మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో ఓ రైతు ఇబ్బందులు పడుతున్నాడు. మండలంలోని జంలం గ్రామ శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను జావిద్ అనే ఓ రైతు పొలంలో నుంచి వేశారు. పొలంలో నుంచి వేయడంతో తనకు ఇబ్బందిగా ఉందని జావిద్ ఆరు నెలల క్రితం కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. లైన్‌ను తొలగించి ఇతర ప్రదేశానికి షిఫ్ట్ చేయాలని కోరాడు. ఈ విషయమై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు కలెక్టర్ సమస్య పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులకు ఆదేశించారు. అయితే పైప్‌లైన్‌ను మరోచోటుకి మార్చడానికి నిధులు లేవని అధికారులు చేతులెత్తేశారు. చేసేది లేక రైతు తన సొంత ఖర్చుతో పైప్‌లైన్ తొలగించి మరోచోటుకు బదిలీ చేస్తానని అంగీకరించడంతో అధికారులు అనుమతించారు. దీంతో రైతు పైప్‌లైన్ తొలగించి, మరో చోటుకు షిఫ్ట్ చేసే పనికి శ్రీకారం చుట్టారు. ఐదు రోజులుగా పనులు జరుగుతుండడంతో మండలంలోని జైతాపూర్, ఎంఎస్సీ ఫారం, బాపూనగర్, జానకంపేట్, పోచారం గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడంలేదు. దీన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు పనులు జరిగే చోట అడ్రస్ లేకుండా పోయారు. పనులు సరిగా చేయని పక్షంలో పైప్‌లైన్ లీకై తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. అధికారులు పనులను పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడాసర్టిఫికెట్లు.. అంగట్లో సరుకులు..!

- ఇన్విటేషన్ టోర్నీలకు తీసుకెళ్లి అంటగడుతున్న వైనం
- వ్యాలిడ్ కావని తెలిసీ మోసగిస్తున్న అక్రమార్కులు
- క్రీడాకారుల జీవితాలతో ఆటలు



బాధిత క్రీడాకారిణి స్వప్న, తల్లిదండ్రులు

నిజామాబాద్‌నాగారం: క్రీడా సర్టిఫికెట్లు అంగట్లో సరుకుల్లా విక్రయిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్లకు ఒక్కదానికి ఒక్కో రేటు నిర్ణయించి అక్రమార్కులు వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు వసూలు చేసి ఇన్విటేషన్ టోర్నీలకు తీసుకెళ్లి సర్టిఫికెట్లను అంటగడుతున్నారు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కింద పనిచేయవని తెలిసినా క్రీడాకారులను మోసగిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.

ఇన్విటేషన్ టోర్నీల పేరిట..

కొన్నేళ్ల నుంచి వివిధ క్రీడలకు సంబంధించి ఇన్విటేషన్ టోర్నీల పేరుతో జాతీయ, అంతర్జాతీయస్థాయికి క్రీడాకారులను తీసుకెళ్తున్నారు. కొన్ని క్రీడలకు సంబంధించి అక్రమార్కులు అమాయక క్రీడాకారులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ రెండు, మూడు దేశాలకు ఇన్విటేషన్ టోర్నీలకు తీసుకెళ్తున్నారు. ఇందుకు గాను ఒక్కో క్రీడాకారుడి దగ్గర నుంచి సుమారుగా రూ. 50వేల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. సర్టిఫికెట్లు ఇప్పిస్తామని, ఉన్నత చదువుల కోసం, భవిష్యత్తులో ఉద్యోగాలు వస్తాయంటూ నమ్మబలుకుతున్నారు. కానీ ఇన్విటేషన్ టోర్నీల్లో జారీ చేసిన సర్టిఫికెట్లు వాలీడ్ కావు. అయినా కొందరు జిల్లాలో ప్రతి ఏడాది పదుల సంఖ్యలో క్రీడాకారులను ఇన్విటేషన్ టోర్నీలకు తీసుకెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారు.

రూ. 50వేలు చేసినట్లు ఫిర్యాదు చేయడంతో..

నగరంలోని సాయినగర్‌కు చెందిన ఉప్పరి స్వప్న అనే క్రీడాకారిణిని శ్రీనివాస్‌గౌడ్ అనే ప్రైవేటు కోచ్ కిక్‌బాక్సింగ్‌లో నేషనల్ టోర్నీకి తీసుకెళ్తామని నమ్మించి రూ. 50వేలు వసూలు చేశాడు. 10 నెలల నుంచి టోర్నీకి తీసుకెళ్లకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో క్రీడాకారిణి నగరంలోని 5వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్ జిల్లాలో క్రీడలకు, క్రీడాకారులకు కొదువ లేదు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, స్కేటింగ్, హాకీ, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్, ఉషూ, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, తైక్వాండో, కరాటే, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్‌లలో క్రీడాకారులు రాణిస్తున్నారు. ఆయా క్రీడలకు సంబంధించి జిల్లాలో అసోసియేషన్లు సైతం ఉన్నాయి. కొన్ని అసోసియేషన్లు క్రీడలకు, క్రీడాకారులకు ప్రాధాన్యత ఇస్తూ అధికారికంగా ఎంపికలు, టోర్నీలు నిర్వహిస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయికి పంపిస్తున్నాయి. కానీ మరికొన్ని అసోసియేషన్లు డబ్బులు వసూలు చేస్తూ ఇన్విటేషన్ టోర్నీలకు పంపిస్తున్నాయి.

చర్యలు తీసుకోవాలి



జిల్లాలో చాలామంది క్రీడాకారులను ఇన్విటేషన్ టోర్నీలకు తీసుకెళ్తున్నారు. ఈ టోర్నీలకు సంబంధించిన సర్టిఫికెట్లు భవిష్యత్తులో ఉపయోగపడవు. ఈ విషయం క్రీడాకారులకు, వారి తల్లిదండ్రులకు తెలియక మాయమాటలతో నష్టపోతున్నారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలి. – సయ్యద్‌ఖైసర్, అథ్లెటిక్స్‌లో నేషనల్ గోల్డ్‌మెడలిస్టు

కడుపునిండా ఉపాధి

- వలస కూలీలకు అన్నం పెడుతున్న ఇందూరు జిల్లా
- వరినాట్లు, పసుపు తవ్వకాలకు పక్క రాష్ట్రాల నుంచి కూలీలు
- గుడారాలు వేసుకుని పిల్లాపాపలతో జీవనం



డొంకేశ్వర్‌లో పసుపు పంటను తవ్వుతున్న మహారాష్ట్ర కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): పక్క రాష్ట్రాల నుంచి వలస వచ్చే వ్యవసాయ కూలీలకు ఇందూరు 'ఉపాధి' కల్పిస్తోంది. వరినాట్ల నుంచి మొదలుకొని పంట కోతల వరకు పనులన్నీ ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర కూలీలే చేస్తున్నారు. ఇందుకోసం ప్రతియేటా వానాకాలం, యాసంగి సీజన్లలో వందల గ్రూపులు జిల్లాకు వస్తున్నాయి. పిల్లాపాపలతో వచ్చి గ్రామాల్లో గుడారాలు వేసుకుని నివాసం ఉంటున్నారు. జిల్లాలో వ్యవసాయ పనులకు డిమాండ్ ఉండడంతో యేటా వలస కూలీల సంఖ్య పెరుగుతోంది. వరి, పసుపు, జొన్న పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనులకు స్థానిక కూలీలు ఉన్నప్పటికీ పక్క రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీల పనితీరు మెరుగ్గా, పద్ధతిగా కనిపిస్తుంది. దీంతో రైతులు ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర కూలీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక ఎకరం వరినాట్లు వేసిన కూలీ బృందానికి రూ. 4,500 నుంచి రూ. 5,400 వరకు కూలీ లభిస్తోంది. నాట్లు వేయడం పూర్తవగానే వారి స్వస్థలాలకు వెళ్లి మళ్లీ పసుపు పంట తవ్వకానికి, జొన్న కోతలకు వస్తారు. అయితే, పసుపును తవ్వేందుకు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో కూలీలు వస్తుంటారు. పసుపును తవ్వే గ్రూపులో ఉండే 20 మంది వరకు సభ్యులకు ఎకరానికి రూ. 16,500 వరకు కూలీ దొరుకుతుంది. పసుపు, జొన్న పంటలు ఉండే ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో మహారాష్ట్ర కూలీలు ఎక్కువగా కనిపిస్తారు.

భార్యభర్తలు జోడీగా..

పసుపు తవ్వకాలకు మహారాష్ట్ర నుంచి పిల్లపాపలతో భార్యభర్తలు జోడీలుగా వస్తున్నారు. ఒక్కో గ్రూపులో 12 జోడీలు ఉంటాయి. వీరి బాగోగులన్నీ స్థానిక మునింలే చూసుకుంటారు. గ్రామాల్లో నివాసం, వసతులు సమకూరుస్తారు. గుడారాలు వేసుకుని అందులోనే రెండు నెలల పాటు జీవనం సాగిస్తారు. పనిచేసే చోటనే చంటి పిల్లలకు ఊయలలు కడతారు. ఆకలేస్తే అక్కడే లాలి స్తారు. భార్యభర్తలు కలిసి పనిచేస్తూ చేదోడు వాదోడుగా ఉంటారు. రోజంతా పనిచేస్తే ఒక్కరికి రూ. 1,000 వరకు ఉపాధి దొరుకుతుంది. పక్క రాష్ట్రాల నుంచి వచ్చి వ్యవసాయ పనులు చేసేవారు జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఉంటున్నారు. ఏడాదికి సరిపడా ఉపాధిని పొందుతున్నారు.

భూములున్నా కూలి పనికి వచ్చా



మహారాష్ట్రలో మాకు వ్యవసాయ భూములున్నాయి. కానీ అక్కడ బోర్లు లేవు. వర్షాలు పడితేనే పంటలు పండిస్తాం. పంట లేని సమయంలో ఇలా నిజామాబాద్‌కు వచ్చి వ్యవసాయ కూలీలుగా పనికి కుదురుకుంటాం. ఎనిమిదేళ్లుగా పసుపు తవ్వడానికి నిజామాబాద్‌కు వస్తున్నాను. కూలి డబ్బులు కూడా బాగానే వస్తాయి. – సార్జిరావు లక్ష్మణ్, మహారాష్ట్ర

పనికి రావడం ఇదే మొదటిసారి..



నిజామాబాద్‌లో వ్యవసాయ పనులకు మంచి కూలి వస్తుందని మహారాష్ట్ర నుంచి చాలామంది భార్యభర్తలు వస్తుంటారు. నేను మొదటి సారిగా పిల్లలతో పనికి వచ్చాను. ఇక్కడే రెండు నెలల పాటు ఉండి పసుపు తవ్వడం, జొన్న కోయడం చేయాలి. మరోపక్క పిల్లలను కూడా జాగ్రత్తగా చూసుకోవాలి.

– ముక్తా, మహారాష్ట్ర

క్లుప్తంగా

నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి

● కేంద్ర మంత్రిని కోరిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వం గ్రామ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్రానికి నిధులు కేటాయిస్తే వాటిని దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని బుధవారం కలిసి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి కేటాయించిన నిధులను సరైన విధంగా ఉపయోగించడం లేదని, ఈ దుర్వినియోగాన్ని అరికట్టాలని కోరారు. ఆయన వెంట బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్ తదితరులు ఉన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ 1, 2, 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ సందర్శించి తనిఖీ చేశారు. ఉదయం జరిగిన పరీక్షకు 40 మందికి 39 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు చంద్రశేఖర్ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్: పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా అధికారిణి పద్మపై విష ప్రయోగం కుట్ర చేసిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సత్తమ్మ, అలివేలుపై కేసు నమోదు చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్ బుధవారం తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తీరుపై వారం రోజుల క్రితం అధికారిణి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో 'సాక్షి' దినపత్రికలో ''విష ప్రయోగమా.. వశీకరణా?'' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో ఐపీసీ 336 సెక్షన్ కింద మానవ ప్రాణానికి లేదా వ్యక్తిగత భద్రతకు హాని కలిగించే పనులు చేసారంటూ వారిద్దరిపై కేసులు నమోదు చేశారు. మరో వైపు ప్రాంగణం అధికారిణికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తినిపించాలనుకున్న పౌడర్‌ను సైతం సేకరించి ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్‌కు పంపిస్తామన్నారు. రిపోర్టు వచ్చాక దాని ఆధారంగా మరిన్ని సెక్షన్‌లు చేర్చే అవకాశం ఉందని వివరించారు.

గవర్నర్‌ను కలిసిన వైస్ ఎంపీపీ



మోపాల్: తెలంగాణ, పాండిచ్చేరి గవర్నర్ తమిళిసైను మోపాల్ వైస్ ఎంపీపీ అనితాప్రతాప్‌సింగ్ బుధవారం కలిశారు. పాండిచ్చేరిలో ఉన్న ఓ జ్ఞాన మందిరంలో గవర్నర్‌ను వైస్ ఎంపీపీ కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

జేఏవో బదిలీ

నిజామాబాద్ నాగారం: విద్యుత్ శాఖలోని ఆర్మూర్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అకౌంట్ ఆఫీసర్ సూర్యనారాయణ మూర్తిని బదిలీ చేసినట్లు ఆర్మూర్ డీఈ హరిచంద్ర నాయక్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్ విద్యుత్ శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. జూనియర్ అకౌంట్ ఆఫీసర్ రమేశ్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు.

భూమి లేకున్నా క్రయవిక్రయాలు

- ధరణి చిక్కులు..
- ప్రతి గ్రామంలో పొజిషన్ లేకుండా పట్టాలు



నిజామాబాద్ రూరల్: గత ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ కోసం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఈ ప్రక్రియ ద్వారానే జరుగుతున్నాయి. దీంతో ఈ పోర్టల్‌లో కొనసాగే ఆటోమెటిక్ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లతో అనేక వివాదాలు ఉత్పన్నమవుతున్నాయి. 2018లో చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన తరువాత కొత్త పాస్ బుక్కులు జారీ అయ్యాయి. పొజిషన్‌లో లేకపోయినా రికార్డుల్లో భూమి ఉంటుండడంతో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అక్రమార్కులు.. ఆ సర్వే నంబరులో ఏదో మూలన భూమిని చూయించి మరొకరికి విక్రయిస్తున్నారు. కొన్నవారు ఆ భూమి తమదంటూ ఇతరులతో గొడవకు దిగుతున్నారు. దీంతో పొజిషన్‌లో ఉన్న రైతులు కేసుల పాలవుతున్నారు.

అస్తవ్యస్త డేటాతో కష్టం

భూరికార్డుల ప్రక్షాళన తర్వాత వాటికి అనేక చిక్కుముళ్లు వేశారు. ప్రతి ఊరిలోనూ ఆర్‌ఎస్‌ఆర్ డిపరెస్ (సేత్వార్ కంటే అదనం) చాలా ఉన్నది. ఒక్కో రెవెన్యూ విలేజ్‌లో 10 నుంచి 20 శాతం విస్తీర్ణం పెరిగింది. గతంలో రైతులు భూమి అమ్మేసినా రికార్డుల్లో అలాగే కొనసాగించడంతో తిరిగి సేల్ డీడ్స్ చేశారు. అసలు భూమి లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ అయ్యాయి. భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో వారంతా అదే సర్వే నంబరులోని రైతులతో గొడవ పడుతున్నారు. అర్బన్, రూరల్ అన్న తేడా లేకుండా అన్ని చోట్లా ఈ సమస్య ఉత్పన్నమైంది.

వాస్తవం కంటే లక్షలాది ఎకరాల విస్తీర్ణం పెరిగిందని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. అందుకే టీఎం 33 కింద వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేదా తిరస్కరణకు గురవుతున్నాయి. కేవలం ఆర్‌ఎస్‌ఆర్ సమస్య అంటూ తహసీల్దార్లు భూసమస్యలు పరిష్కరించకుండా తిప్పి పంపిస్తున్నారు. ఆఖరికి పొజిషన్‌లో ఉన్న రైతుల విస్తీర్ణం, సర్వే నంబర్లను కూడా సరి చేయడం లేదు. దీంతో అస్తవ్యస్తమైన రెవెన్యూ డేటాతో ఆటోమెటిక్ మ్యుటేషన్ సాధ్యం కాదని రెవెన్యూ నిపుణులు, రిటైర్డ్ ఆర్డీవోలు ఆరోపిస్తున్నారు.

ప్రజల్లోనూ భయం..

రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మ్యుటేషన్ బాధ్యతలను రెవెన్యూ ఉద్యోగులకు అప్పగిస్తే ఎంత ఇబ్బంది పెడతారోనన్న భయం కూడా జనంలో నెలకొంది. ఆటోమెటిక్ మ్యుటేషన్ లేకపోతే దానికి కూడా కొర్రీలు పెట్టి లంచాలు తీసుకునే అవకాశం ఉందని రిటైర్డ్ రెవెన్యూ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధరణి కమిటీ సిఫారసులపై ఆసక్తి..

స్లాట్ బుక్ చేసుకోవడం, జాయింట్ రిజిస్ట్రార్ దగ్గర రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఇంటికి పాస్ బుక్కు వచ్చేస్తున్నది. కానీ నిజానికి రికార్డుల్లో ఆ భూమి ఉందా? లేదా? అన్న విచారణ జరగడం లేదు. ఇలా భూమే లేకుండా క్రయ విక్రయాలకు ఆస్కారం ఏర్పడుతున్నది. దీంతో కొందరు అక్రమంగా పట్టా పొందిన వారి నుంచి కొనుగోలు చేయడం... పొజిషన్‌లో ఉన్న వారితో గొడవకు దిగడం ప్రస్తుతం కామన్‌గా మారింది.

రిజిస్ట్రేషన్ సమయంలో భూమి హక్కుదారుడికి విషయం తెలిసినా.. నిలిపివేయించే అధికారం లేదు. రికార్డుల్లో ఉన్న వ్యక్తి స్లాట్ బుక్ చేసుకున్నాడంటే.. ఆ రిజిస్ట్రేషన్/మ్యుటేషన్ ఆపడం ఎవరి వల్లా కాదు. అధికారం తహసీల్దార్‌కు కూడా లేకుండా ధరణి పోర్టల్ చేసేసింది. అలాగే ఆటోమెటిక్ సక్సెషన్, నాలా కన్వర్షన్ వంటి సదుపాయాలతో అసలుకే మోసం తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు 'భూమాత'లో ఆటోమెటిక్ మ్యుటేషన్‌పై ధరణి కమిటీ ఎలాంటి సిఫారసు చేస్తుందోననేది ఆసక్తికరంగా మారింది.

క్షుణ్ణంగా పరిశీలించాలి

తహసీల్దార్లు భూపట్టాలు మార్పు చేసేటప్పుడు భూమికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీంచాలి. భూములను నాలా కన్వర్షన్ చేసేటప్పుడు అందులో ప్రభుత్వ భూమి ఉందా లేదా అనే విషయాన్ని గమనించాలి. లేదంటే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను క్షేత్రస్థాయిలో పరిశీలనకు పంపించాలి.

– రాజేంద్రకుమార్, ఆర్డీవో, నిజామాబాద్

పట్టాపాస్‌బుక్ తప్పనిసరి



పట్టాదార్ పాసుపుస్తకం లేనిదే భూములు రిజిస్ట్రేషన్ కావు. ముఖ్యంగా లావుని పట్టా, ఆబాదు, ఇనాం, శిఖం భూములు పట్టాలు కావు. అసైన్డ్‌భూములు పట్టాదారులు బతికి ఉన్నన్ని రోజులు వారిపైనే ఉంటాయి. వాటిని పంపకం చేపట్టడానికి ధరణిలో ఆప్షన్ లేదు.

– అనురుద్, రూరల్ తహసీల్దార్

భక్తి మార్గంతోనే ముక్తి

- ఘనంగా ముగిసిన సాధు సమ్మేళనం
- స్వామీజీలకు సత్కారం

డిచ్‌పల్లి: మానవునికి భక్తి మార్గమే ముక్తి మార్గమని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పలువురు పీఠాధిపతులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌ఎల్‌జీ గార్డెన్స్‌లో శ్రీ వశిష్ఠ సంచార శత సత్సంగ మహోత్సవ సంబురాల్లో భాగంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాధు సమ్మేళనం బుధవారం ముగిసింది. శ్రీ వశిష్ఠ సంచార సత్సంగ సంస్థాపక అధ్యక్షుడు శ్రీ సచ్చిదానందగిరి స్వామి నేతృత్వంలో సాధు సమ్మేళానికి వచ్చిన పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గద్దె భూమన్న, శ్రీవశిష్ఠ సంచార సత్సంగ ప్రధాన కార్యదర్శి చౌకి రాములు, సహాయ కార్యదర్శి చాట్ల భరత్ భూషణ్, యజ్ఞాచార్యులు శ్రీమాన్ కిషన్ పంతులు, శ్రీమాన్ రజనీశ్ పంతులు, శ్రీనివాస్ మహరాజ్, చౌకి లక్ష్మణ్, పార్శి రాజేందర్, శక్కరికొండ మోహన్ పాల్గొన్నారు.



కాశీలో తల్లి అస్థికలు నిమజ్జనం చేసేందుకు వెళ్తూ..

● రైలులో గుండెపోటుతో తాళ్లరాంపూర్ వాసి మృతి



కుమార్ (ఫైల్)

మోర్తాడ్: తల్లి అస్థికలను కాశీలోని గంగానదిలో నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న ఏర్గట్లకు చెందిన తాళ్లరాంపూర్‌కు చెందిన కుమార్(44) గుండెపోటుతో మృతిచెందాడు. తన అక్క, బావలతో కలిసి కుమార్ మంగళవారం రైలులో కాశీకి బయలుదేరి వెళ్లాడు. బుధవారం అలహాబాద్ సమీపంలో కుమార్‌కు తీవ్రగుండెపోటు వచ్చింది. దీంతో అతనికి చికిత్స అందించే ప్రయత్నంలోనే మృతిచెందాడు. గురువారం ఉదయం తాళ్లరాంపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ పలువురి మృతి

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన రాంపూర్ కృష్ణ(32) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నెల 1న తన బైక్‌పై భార్య, కుమారుడితో కలిసి పిట్లంకు వెళ్తుండగా జగదాంబ తండా సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కృష్ణను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. కృష్ణ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ..

నందిపేట్: మండలంలోని సీహెచ్ కొండూరు సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన దూసమూడి రుక్మవ్వ (42) భర్త సాయన్న, కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం ఆర్మూర్‌కు వలస వచ్చారు. ఈ నెల 1న భర్తతో కలిసి బైక్‌పై స్వగ్రామమైన ఎడ్‌బిడ్‌కి మంగళవారం వెళ్తుండగా కొండూరు సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో రుక్మవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వన్నెల్ సమీపంలో మరొకరు..

నందిపేట్: మండలంలోని వన్నెల్(కె) సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన పద్మ (27) ఈనెల 2న తన మామతో కలిసి బైక్‌పై ఆర్మూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ పద్మను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

22.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కామారెడ్డి టౌన్: పట్టణ కేంద్రంలోని పలు చోట్ల టాస్క్‌ఫోర్స్ పోలీసులు 22.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టుకున్నారు. రాజీవ్‌నగర్‌కు చెందిన రేవూరి ప్రభాకర్ నుంచి 9.15 క్వింటాళ్లు, జేపీఎస్ రోడ్డులో కొడిప్యాక శ్రీనివాస్ నుంచి 2.25 క్వింటాళ్లు, కిష్టమ్మ గుడి సమీపంలో మహ్మద్ అజీజ్ నుంచి 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. డీఎస్‌వో మల్లికార్జున బాబు, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య ఆధ్వర్యంలో బుధవారం పంచనామా నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పోలీసులకు అనుమానిత మహిళ అప్పగింత

మోపాల్: బాడ్సి గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో గ్రామస్తులు బుధవారం పట్టుకున్నారు. సూర్యోదయ పాఠశాల వద్ద మహిళ తిరుగుతుండటంతో స్థానికులు పట్టుకుని నిలదీశారు. జిల్లాలో చిన్న పిల్లలు వరుసగా కిడ్నాప్‌నకు గురవుతున్న నేపథ్యంలో గుర్తు తెలియని మహిళ సంచరిస్తుండటంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. సదరు మహిళ ఎలాంటి సమాధానం చెప్పకపోగా గ్రామస్తులనే బెదిరిస్తుండటంతో వారు పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. కాగా మహిళ నగరంలోని హమాల్‌వాడికి చెందిన పుష్పగా పోలీసుల విచారణలో తేలింది. కొంతకాలంగా మానసికస్థితి బాలేదని, మూగ, చెవిటి పత్రాలు చూయిస్తూ యాచక వృత్తి చేస్తుందని పోలీసులు తెలిపారు. కుటుంబీకులకు సమాచారమిచ్చి అప్పగించినట్లు తెలిసింది.

కాలువలో పడి ఒకరి మృతి

నందిపేట్: మండల కేంద్రంలోని గుత్ప కాలువలో ఒకరు పడి మృతిచెందినట్లు ఎస్సై రాహుల్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన లోక మహిపాల్‌రెడ్డి(35) వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం నందిపేటకు వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని కాలువ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో నీటి సరఫరాను నిలుపుదల చేయించారు. కాలువలో ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ శివారులో బుధవారం ఆటో బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ సయ్యద్ నజీర్(56) మృతిచెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సయ్యద్ నజీర్ సొంత ఆటోలో ఆర్మూర్ నుంచి మోర్తాడ్‌కు వెళ్తుండగా అంక్సాపూర్ శివారులో కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించబోయి బోల్తాపడినట్లు తెలిపారు. ఈ ఘటనలో నజీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహితపై అత్యాచారయత్నం

నందిపేట్: నందిపేట్ మండల కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న వివాహితపై ఓ యువకుడు అత్యాచారయత్నానికి బుధవారం పాల్పడ్డాడు. బాధితురాలి అరుపులు విన్న కాలనీవాసులు అక్కడికి చేరుకునే లోగా పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. సదరు వివాహిత ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తన భర్త గురించి అడిగి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

అదుపుతప్పిన కారు

ఇందల్వాయి: మండలంలోని అటవీ ప్రాంతంలో కారు అదుపు తప్పిన ఘటనలో దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా తుక్కల ఎల్లారెడ్డికి చెందిన స్వరూప వెంకటేశ్వర దంపతులు కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు ఇందల్వాయి అటవీ ప్రాంతంలోని జాతీయ రహదారిపై పక్కదారిలోకి దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడ్డ దంపతులను టోల్ ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

బోరు మోటారు చోరీ

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శ్మశాన వాటికలో గుర్తు తెలియని దుండగులు బోరు మోటారును దొంగిలించినట్లు పంచాయతీ కార్యదర్శి సాయిలు బుధవారం తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

నాణ్యమైన పండ్లు విక్రయించాలి

● ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



పండ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ప్రజలకు నాణ్యమైన పండ్లు విక్రయించాలని, వాటిపై రసాయన పదార్థాలు చల్లవద్దని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఫ్రూట్ మార్కెట్‌ను ఎమ్మెల్యే బుధవారం సందర్శించి, వ్యాపారులతో మాట్లాడారు. కాయలుగా ఉన్న వాటిని పండ్లు కావడానికి ఎలాంటి రసాయనాలు వాడినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పండ్ల పెంపకంపై వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టొద్దు

● సైబర్ క్రైం ఏసీపీ వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సైబర్ క్రైం ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో సైబర్ క్రైంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు పెరుగుతున్న టెక్నాలజీని ఆసరా చేసుకొని అమాయక ప్రజలపై అధిక వడ్డీ ఆశ చూపి పెట్టిన పెట్టుబడి కంటే అధిక డబ్బులు వస్తాయంటు మోసం చేస్తున్నారు. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, మెసేజీలను ఓపెన్ చేయొద్దని సూచించారు. లోన్ యాప్ అంటూ సులభంగా లోన్‌లు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ డేటా మొత్తం తమ ఆధీనంలోకి తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీంతో చాలా మంది ఇబ్బందులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైం పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ నరహరి, మూడవ పట్టణ ఎస్సై ప్రవీణ్ కుమార్, సైబర్ క్రైం ఎస్సైలు పూర్ణేశ్వర్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. ఉదయం నిర్వహించిన జనరల్ పరీక్షలకు 1,394 మందికి 1,357 మంది హాజరుకాగా 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 402 మందికి 367 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన జనరల్ పరీక్షల్లో 1,035 మందికి 1,009 మంది హాజరుకాగా 26మంది గైర్హాజరు కాగా ఒకేషనల్‌లో 481 మందికి 448 హాజరు కాగా 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

సీఎంకు శుభలేఖ అందజేత



డిచ్‌పల్లి: సీఎం రేవంత్ రెడ్డికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దంపతులు శుభలేఖను హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు. తన కుమారుడు రేకులపల్లి స్నేహిత్‌రెడ్డి వివాహానికి కుటుంబ సమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వదించాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కేసీఆర్‌ను దూషించడం పద్ధతి కాదు

- హామీలను అమలు చేయకుంటే నిలదీస్తాం
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వారికి హుందాతనం ఉండాలని, మాజీ సీఎం కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి దూషించడం పద్ధతి కాదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ సమీపంలోని ఎస్‌ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతం తక్కువ ఓట్ల తేడాతో అధికారం కోల్పోయమన్నారు. 20 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చిస్తే సరిపోయేదన్నారు. 2028లో ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీతో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తారని అన్నారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకుడు సిగ్గులేకుండా బాన్సువాడ నియోజకవర్గంలో తిరుగుతున్నారని, ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉండి సొంత ఊరిలో పేదలకు ఒక్క ఇల్లు కట్టించలేదన్నారు. ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. చేయకపోతే ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బంధు రూ.15 వేలు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపును బాన్సువాడ నియోజకవర్గమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. నిజాంసాగర్ నీటి విడుదల విడతల వారీగా జరుగుతుందని, ఎకరం కూడా ఎండిపోకుండా చూస్తానన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీకి సిద్ధం

పార్టీ ఆదేశిస్తే జహీరాబాద్ ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కీలకమైన నియోజకవర్గం బాన్సువాడ అన్నారు. ప్రతి కార్యకర్తకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, అంజిరెడ్డి, బద్యా నాయక్, నీరజావెంకట్‌రాంరెడ్డి, శ్యామల ఉన్నారు.

మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్య



సందీప్(ఫైల్)

కామారెడ్డి క్రైం: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా సమీపంలోని నర్సన్నపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఎలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన మెత్తల సందీప్(26) కామారెడ్డిలోని ఓ కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఉదయం నర్సన్నపల్లి గేటు వద్ద ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఎస్సై తావు నాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. విచారణలో మృతుడిని సందీప్‌గా గుర్తించారు. సందీప్ తండ్రి కుటుంబాన్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడని, అతని సోదరుడు సైతం రైలు ప్రమాదంలో మృతి చెందాడు. పలు కారణాలతో కొన్ని రోజులుగా అతని మతిస్థిమితం బాగా లేదని కుటుంబీకులు తెలిపారు. మతిస్థిమితం సరిగా లేకనే ఆత్మహత్య చేసుకున్నాడన్న అతని భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జంతువుల దాడిలో మేకలు మృతి



ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్ తండాలో లావుడ్య గోప్యకి చెందిన ఏడు మేకలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని అటవి జంతువులు దాడి చేసి చంపినట్లు డీఆర్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీటీసీ లలితాగణేశ్ ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి పశువైద్యాధికారి గంగాప్రసాద్‌తో కలిసి మృతి చెందిన మేకలకు బుధవారం పంచనామా నిర్వహించినట్లు చెప్పారు. మేకల కొట్టం అటవికి దగ్గరగా ఉండటంతో జంతువులు దాడి చేశాయన్నారు. బాధితుడికి అటవీశాఖ తరఫున పరిహారం అందేలా కృషి చేస్తామని డీఆర్వో తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడవ టౌన్ పీఎస్ పరిధిలో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. దాడిలో ముగ్గురిని అరెస్టు చేయగా వీరి నుంచి రూ. 3890 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొప్పర్గలో..

బోధన్‌రూరల్: మండలంలోని కొప్పర్గ గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ముగ్గురిని అరెస్టు చేశామని వారి నుంచి రూ.4,630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


పోలీసుల అదుపులో నిందితుడు

వర్ని: మండలంలో మోటార్ల దొంగతనానికి పాల్పడుతున్న ఓ నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ జెయేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురం జీపీలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఇటీవల మోటారు పంపుసెట్టు చోరీకి గురైంది. ఈ పంపుసెట్టును మండల కేంద్రంలోని పాత ఇనుస సామాను దుకాణంలో గుర్తించినట్లు తెలిపారు. విక్రయించిన వ్యక్తితో పాటు కొనుగోలు చేసిన దుకాణ యజమానిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఇందల్వాయి ఎస్సైపై కేసు నమోదు

ఇందల్వాయి: ఇందల్వాయి పీఎస్‌లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్సై మహేశ్‌పై కేసు నమోదైనట్లు సమాచారం. ఓ మహిళను మోసం చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

కల్లు గుడిసె దగ్ధం



మోపాల్: ముదక్‌పల్లిలో ఉన్న కల్లు గుడిసె మంగళవారం రాత్రి దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న రాజాగౌడ్ కల్లు విక్రయిస్తుంటాడు. రోజులాగే కల్లు గుడిసెకు రాత్రి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పంటించడంతో దగ్ధమైంది. సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.